నేడు డయల్ యువర్ డీఎం

సంతోష్‌నగర్: ఆర్టీసీ బస్సు ప్రయాణికుల సమస్యలపై ఈ నెల 13న మిధాని ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ విజయ్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే డిపో మేనేజర్ కార్యక్రమంలో ఆర్టీసీ బస్సు ప్రయాణికులు పాల్గొని తమ ఫిర్యాదులను చేయాలన్నారు. ప్రయాణికులు 9959226139లో నంబర్ ఫోన్ చేసి తమ ఫిర్యాదులను అందజేయాలన్నారు.

'భారత్‌కు ఎదురు లేదు'



విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌చారి తదితరులు

గోల్కొండ: భారత్‌కు తిరుగులేదు అన్న విషయం మరోమారు రుజువైందని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో సోమవారం రిసాల బజార్‌లో ఆయన ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రక్షణ రంగంలో అగ్రదేశాలకు ధీటుగా భారత దేశం ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.సాయిబాబాచారి, శివ, బి.సురేష్‌చారి, రాములు తదితరులున్నారు.

సన్మానం



గోల్కొండ: ఈ సంవత్సరం హజ్ యాత్రకు వెళ్లే వారు దేశ సమగ్రత, సౌభాగ్యం కోసం ప్రార్థించాలని షేక్‌పేట్ నూర్ మజీద్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు, సీనియర్ మజ్లిస్ నాయకుడు మహ్మద్ ముస్తఫా అన్నారు. హజ్ యాత్రకు ఎంపికైన వారికి సోమవారం సెవన్ టూంబ్స్ సమీపంలో గల నూర్ మజీద్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హజ్ యాత్రకు వెళ్లడం జీవితంలోనే అత్యంత పవిత్ర ఘట్టమన్నారు. మజీద్ కమిటీ ఉపాధ్యక్షులు ఫహీముద్దీన్, మహబూబ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అబిడ్స్: చెన్నకేశ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గుడిమల్కాపూర్ వెజిటేబుల్ మార్కెట్ వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వందలాది మంది కార్మికులు, స్థానికులు అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజా వెంకట వసంత, అన్నపూర్ణ, భారతి, గాంధీ, శారద తదితరులు ఉన్నారు.

క్రికెట్ కిట్ల అందజేత



క్రికెట్ కిట్లను అందజేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలఅన్నారు. బంజారాహిల్స్ డివిజన్‌లోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో యువకులకు సోమవారం క్రికెట్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిట్స్‌ను సద్వినియోగం చేసుకుని క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు. వేసవి శిబిరాలతోనే చాలామంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ఆటలో నిరంతర ప్రాక్టీస్ చేయాలన్నారు.

శంకర్ జికి ఘన నివాళి



శంకర్ జి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ వ్యవస్థాపకుడు శంకర్ జి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు గాంధీభవన్ సమీపాన ఉన్న ఆయన విగ్రహానికి సోమవారం ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి రాజేందర్ రెడ్డి, ఎగ్జిబిషన్ ఎకనామిక్ కమిటీ ఎగ్జిబిషన్ ప్రతినిధులు డాక్టర్ గంగాధర్ డాక్టర్ ప్రభాశంకర్, హరినాథ్ రెడ్డి, నిరంజన్, సురేందర్ జి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎగ్జిబిషన్ సొసైటీ వ్యవస్థాపకుడు శంకర్ జి సమాజ శ్రేయస్సుకు చేసిన సేవలు కొనియాడారు.

అధ్వానంగా జలమండలి నీటి ట్యాంకర్లు



తుప్పపట్టిన నీటి ట్యాంకర్

- తుప్పు పడుతున్న ట్యాంకర్లు
- వృథా అవుతున్న తాగునీరు
- పట్టించుకోని అధికారులు

గోల్కొండ: జలమండలి వారు ఉపయోగిస్తున్న నీటి ట్యాంకర్లలో కాలం చెల్లినవే ఎక్కువగా ఉంటున్నాయి. తుప్పుపట్టి రంగులు ఊడి చిల్లులు పడ్డ నీటి ట్యాంకర్ల నుంచి తాగునీరు వృథా అవుతోంది. చాలా నీటి ట్యాంకర్లకు పైన మూతలే ఉండడం లేదు. నీటి ట్యాంకర్లు రోడ్లపై రాకపోకలు సాగించే సమయంలో తాగునీరు రోడ్లపై వృథాగా పారుతోంది. మరోవైపు ట్యాంకర్ కింద భాగంలో ఉన్న చిల్లుల నుంచి తాగునీరు జలధారలా ట్యాంకర్ వెళ్లే మార్గంలో పడిపోతున్నాయి. జలమండలి వారు వాడుతున్న ట్యాంకర్లను పైన ఇంత అధ్వానంగా ఉంటే లోపల ఇంకా ఎంత అధ్వానంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఏదేమైనా డబ్బులు పెట్టి జలమండలి నుంచి నీరు కొనే వారికి ట్యాంకర్ కాస్తా ఇంటికి వచ్చే వరకు కనీసం మూడు నుంచి 500 లీటర్ల నీరు తక్కువ రావడం ఖాయం.



రంగు కోల్పొయిన నీటి ట్యాంకర్ వెనుక భాగం

కౌలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న రైతు స్వరాజ్య వేదిక నేతలు

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలోని కౌలు రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రైతు స్వరాజ్య వేదిక నేతలు కుర్వ మంజుల, రమాకాంత్, సుమలత, కొండల్, రవి, కిరణ్‌కుమార్, ఆశలత మాట్లాడారు. ఎంతోకాలంగా కౌలు భూమి చేస్తూ జీవనం సాగిస్తున్నామని కౌలు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో కౌలురైతుల సమస్యలను తెలియజేయడం జరిగిందన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో కౌలు రైతులకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని కాంగ్రెస్ స్పష్టంగా హామీ ఇచ్చిందన్నారు. ఏడాదిన్నర గడిచినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. 2011 భూ ఆధికృత సాగుదారుల చట్టాన్ని అమలు చేస్తూ కౌలు సాగుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఎల్ఈసీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పంట బీమా, పంటనష్ట పరిహారం, రైతు బీమా, పంట అమ్మకాలు, బ్యాంకు రుణాలు అందించాలని డిమాండ్ చేశారు.

తల్లిని చంపుతానని బెదిరించిన కుమారుడిపై కేసు

నాంపల్లి: ఆస్తి కోసం తల్లిని చంపుతానని బెదిరించిన కుమారుడిపై హబీబ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన దారుస్సలాంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..దారుస్సలాం రోడ్డులో లలిత యాదవ్, నర్సింహాయాదవ్ దంపతులు ఉంటున్నారు. నర్సింహులు యాదవ్ కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. వీరికి నలుగురు కుమారులు ఉన్నారు. తల్లి లలిత యాదవ్, కుమారుడు శ్రీనివాస్‌యాదవ్ దారుస్సలాం రోడ్డులోని మూడంతస్తుల భవనంలో ఉంటున్నారు. కుమారుడు శ్రీనివాస్ యాదవ్ రెండవ, మూడవ అంతస్తులో ఉంటున్నాడు. తల్లి లలిత యాదవ్ గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులో ఉంటూ వచ్చే అద్దెలతో జీవనోపాధి పొందుతోంది. కుమారుడు శ్రీనివాస్ యాదవ్ గ్రౌండ్, మొదటి అంతస్తులను కూడా తన ఆధీనంలోకి తీసుకునే దురాలోచన కలిగింది. దీంతో తల్లితో తరచూ గొడవ పడుతున్నాడు. ఇందులో భాగంగా తల్లిని చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. భయభ్రాంతులకు గురైన తల్లి లలితా యాదవ్ కుమారుడు శ్రీనివాస్ యాదవ్‌పై హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ప్రియురాలిపై దాడి చేసిన యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: మాజీ ప్రియురాలిపై దాడికి పాల్పడటమే కాకుండా ఆమె తాజా బాయ్‌ఫ్రెండ్‌ను బెదిరింపులకు గురిచేస్తూ ఆమెను తీవ్రంగా కొట్టిన ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. నాచారం ప్రాంతానికి చెందిన కోటి అఖిల్‌కుమార్(28) బంజారాహిల్స్ రోడ్డు నంబర్-14లోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అందులో పనిచేస్తున్న యువతిని కొంతకాలంగా ప్రేమించాడు. ఇద్దరూ కలిసి ఉన్నత చదువుల కోసం పోలాండ్ దేశానికి వెళ్లి అక్కడ కొద్ది రోజులు సహజీవనం చేసిన తర్వాత ఇద్దరి మధ్య గొడవలు రావడంతో ఒకరి తర్వాత ఒకరు హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. ఇక్కడికి వచ్చిన తర్వాత బాధిత యువతి మరో యువకుడితో ప్రేమలో పడింది. ఈ విషయాన్ని మాజీ ప్రియుడు అఖిల్ జీర్ణించుకోలేకపోయాడు. ఆమెను తరచూ వెంబడిస్తూ ఆమె రాకపోకలపై నిఘా ఉంచి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే ఆమె విధులు ముగించుకుని బంజారాహిల్స్ నుంచి క్యాబ్‌లో తార్నాకలోని తన గదికి వెళ్తుండగా ఆమెను అనుసరించి ఆమెకు తెలియకుండా నేరుగా ఆమె గదిలోకి వెళ్లి తాజా ప్రియుడితో కలిసి ఉండగా ఫొటోలు తీశాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆమె సెల్‌ఫోన్ లాక్కొని అందులో డేటాను తొలగించి ధ్వంసం చేశాడు. ఆమెను తీవ్రంగా కొట్టడంతో కన్ను, ముక్కుపై తీవ్ర గాయాలయ్యాయి. అఖిల్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, తన ప్రైవేటు వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరిస్తున్నాడని, తన కుటుంబ సభ్యులను కూడా వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు అఖిల్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

సేవల్లో నర్సుల పాత్ర భేష్



కేర్ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు

బంజారాహిల్స్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది సేవలకు కృతజ్ఞతగా వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 'మా నర్సులు.. మా భవిష్యత్తు' థీమ్‌తో చేపట్టిన వేడుకల్లో భాగంగా కేర్ ఆస్పత్రి అన్ని యూనిట్లలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. నర్సుల సేవలను గుర్తించి వారిని ఉత్సాహపరిచేందుకు చేపటినట్లు నిర్వాహకులు తెలిపారు. సేవల్లో నర్సుల పాత్ర కీలకం అన్నారు. కేర్ హాస్పిటల్స్ నర్సింగ్ బృంద అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందన్నారు. నైపుణ్యం, మానసిక బలంతో ప్రతిరోజూ పేషెంట్లకు నాణ్యమైన సేవ అందిస్తున్నారన్నారు. కేర్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్(నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ విన్సీ అశోక్ త్రిభువన్, గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ విశాల్ మహేశ్వరి, గ్రూప్ చీఫ్ మెడికల్ సర్వీసెస్ ఆఫీసర్ డాక్టర్ నిఖిల్ మాథుర్, చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ అమిత్‌సింగ్, వెస్ట్ అండ్ సెంట్రల్ ఇండియా రీజనల్ సీఈఓ హరీష్ త్రివేది, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ వినోద్ రామన్‌తో పాటు వివిధ ఆస్పత్రుల ప్రముఖులు, డాక్టర్లు పాల్గొన్నారు.

అదుపుతప్పిన ఆటో ట్రాలీ

రాజేంద్రనగర్: అదుపుతప్పిన ఓ ఆటో ట్రాలీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెతో పాటు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రధాన రహదారిపై ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వివరాలివీ... బుద్వేల్ ప్రధాన రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్థానికంగా ఉన్న రెండు బస్తీలకు విద్యుత్ సరఫరా అవుతోంది. సోమవారం మధ్యాహ్నం చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన వాటర్ క్యాన్లను సరఫరా చేసే ఆటో ట్రాలీ వేగంగా దూసుకొచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం విరిగి కిందపడగా... ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ధ్వంసమైంది. అదృష్టవశాత్తు ఈ సంఘటన కారణంగా ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఆటో ట్రాలీ డ్రైవర్‌ను నిలదీశారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ కారణంగానే తన ఆటోకు ప్రమాదం జరిగిందని... తనకే నష్టం పరిహారం చెల్లించాలని వాగ్వాదానికి దిగాడు. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభం ఏర్పాటుకు డబ్బులు చెల్లించాలని సిబ్బంది కోరడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీని కారణంగా దాదాపు 6 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చివరకు విద్యుత్ శాఖనే మరమ్మతులు చేసింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ తెలిపారు.

నర్సింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తాం

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వ వైద్య రంగంలో నర్సింగ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గ్రామీణ యువతులను నర్సులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ..ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నర్సులకు తమ ప్రభుత్వంలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు గుర్తు చేశారు. 16 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలను అందుబాటులోకి తీసుకువచ్చామని, రాబోయే రోజుల్లో నర్సుల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన్, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, నర్సింగ్ డీడీ విజ్జులత, అసోసియేషన్ అధ్యక్షురాలు ఆదిలక్ష్మీ, ప్రధాన కార్యదర్శి లలిత తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

గోల్కొండ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.సైదులు తెలిపిన వివరాల ప్రకారం..షేక్‌పేట్ సీతానగర్‌కు చెందిన శ్రావణ్ కుమార్(20) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తండ్రి లింగయ్య షేక్‌పేట్‌లో టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. ఎంత వైద్యం చేసుకున్న ఆరోగ్యం కుదుడపడలేదు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి శ్రావణ్‌కుమార్ కూల్ డ్రింక్‌లో పురుగుల మందు కలిపుకొని తాగాడు. వెంటనే అతడిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే శ్రావణ్‌కుమార్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలతో సహా గృహిణి అదృశ్యం



గన్‌ఫౌండ్రీ: పిల్లలతో సహా గృహిణి అదృశ్యమైన ఘటన సోమవారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, దంతలగడ్డ తండాకు చెందిన బానోతు మల్లేష్ (35), కుటుంబం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నివసిస్తున్నారు. కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ భార్య సరోజ(32), అక్షిత్(12), జయ్(10)లతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా ఇటీవల ఒక పనిమీద వరంగల్‌కు వెళ్లి మూడు రోజుల తర్వాత ఇంటికి రాగా అతని భార్య, పిల్లలు కనిపించకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. చుట్టుపక్కన ఇళ్లు, బంధువుల ప్రదేశాలలో వెతికినా సమాచారం దొరకకపోవడంతో తక్షణమే పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నడుచుకుంటూ వెళ్తున్న బాలుడిపై బ్లేడ్‌తో దాడి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-11లోని గౌరీశంకర్‌కాలనీలో నివసించే రాజేష్ అనే యువకుడు సాయిబాబా టెంపుల్ నుంచి ఫోన్ మాట్లాడుకుంటూ తన స్నేహితుడు రాజు ఇంటికి రాత్రి 9 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో ఓ గుర్తుతెలియని యువకుడు (18) దారికాసి రాజేష్‌తో గొడవకు దిగాడు. తనతో పాటు తెచ్చుకున్న బ్లేడ్‌తో రాజేష్ ఛాతిపై పొడవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. బాధితుడు వెంటనే అక్కడి నుంచి తప్పించుకుని తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం అందగా చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శంకర్‌సింగ్ అన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీధి దీపాల సమస్యపై 2, ఇంజినీరింగ్ సమస్యపై 2, టౌన్‌ప్లానింగ్ సమస్యపై 3, పారిశుద్ధ్య సమస్యపై 2, జనన, మరణ సర్టిఫికెట్ల సమస్యపై ఒక ఫిర్యాదుతో పాటు మొత్తం 10 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ మురుగు నీటి సమస్య, రోడ్లు, వీధి దీపాలు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి



సరోజిని దేవి కంటి ఆసుపత్రి

గోల్కొండ: మెహిదీపట్నంలోని సరోజిని దేవి కంటి ఆసుపత్రికి నగరం నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ప్రతినిత్యం వేలాది రోగులు వస్తుంటారు. రోగులు, వారి సహాయకులు రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెహిదీపట్నం నుంచి శంషాబాద్‌కు వెళ్లే పీవీ ఎక్స్‌ప్రెస్‌వే ఆసుపత్రి ముందు నుంచే ప్రారంభమవుతోంది. ఈ బ్రిడ్జి నుంచి శంషాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు సరోజిని దేవి ఆసుపత్రి ముందు నుంచే వెళ్తాయి. కాగా ఈ రోడ్డుకు డివైడర్ల మధ్య కొంత ఖాళీ ప్రదేశం వదిలారు. ఆసుపత్రికి వచ్చే వారు ఆసుపత్రి నుంచి వెళ్లే వారు డివైడర్‌లో ఉన్న ఖాళీ ప్రదేశం నుంచే రోడ్డు దాటాలి. అయితే రోడ్డు ఇరువైపులా నుంచి రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆసుపత్రికి వచ్చి రోడ్డు దాటేవారు బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటుతున్నారు. ఆసుపత్రి గేటు ముందు గానీ దానికి కొద్ది దూరంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ఆసుపత్రికి వచ్చే రోగులకే కాకుండా రోడ్డు దాటాలనుకునే పాదచారులకు సైతం సౌకర్యవంతంగా ఉంటుంది.

ఘనంగా ఏకశిల లక్ష్మీ నృసింహ స్వామి జయంతి



పూజల్లో ఉమా మహేందర్, పడాల అనంత్ కృష్ణ తదితరులు

జియాగూడ: షాహుకారి కార్వాన్‌లోని ఏకశిల లక్ష్మీ నృసింహ స్వామి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగుతున్న వేడుకల్లో ముఖ్య అతిథులుగా బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో ఉదయం అభిషేకం, అర్చనలు, హోమం, సాయంత్రం భజన కార్యక్రమం, శ్రీ శివ శంకర క్రాంతి సేవా సమితి ఆధ్వర్యంలో మహా అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, ఆకుల గోవర్ధన్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఆలయ ప్రతినిధులు పడాల అనంతకృష్ణ, శ్యామలింగం, శ్రీకాంత్, మణికంఠ రావ్, వినిత్, గోపీ, పవన్, సురేందర్ పాల్గొన్నారు.



నూతన కమిటీ ఎన్నిక

అబిడ్స్: తెలంగాణ గిరిజన గురుకులా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్.శ్రీను, ప్రధాన కార్యదర్శిగా పూర్ణసాయి అఖిల్, కోశాధికారిగా ఎం.శేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం నూతన కమిటీ సమావేశమై భవిష్యత్తుపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గిరిజన గురుకులాల వ్యాయామ ఉపాధ్యాయుల ఎలాంటి సమస్యలైనా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు దామార వెంకటేశ్వర్లు, రిటైర్డ్ సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ అమర్నాథ్ పాల్గొని నూతన కమిటీని అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుల అభివృద్ధికి, వారి సంక్షేమానికి నూతన కమిటీ విశేషంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో బుద్ధపూర్ణిమ వేడుకలు



వేడుకల్లో మనోహర్ గైక్వాడ్ తదితరులు

అబిడ్స్: మంగళ్‌హాట్ గుఫానగర్‌లో బుద్ధపూర్ణిమ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్ ఆధ్వర్యంలో బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బుద్ధుడి ఆశయాలు మానవాళికి ఆదర్శమన్నారు. ప్రతిఒక్కరూ బుద్ధుడి ఆశయాలు పాటిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



కార్యక్రమంలో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: పేద విద్యార్థులకు అండగా ఉంటామని పీస్ ఫోర్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని సొసైటీ కార్యాలయంలో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సాయం అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా నిరుపేద విద్యార్థులకు దాతల సాయంతో స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాయిలు, అసద్, అబ్దుల్ రహీం, మహ్మద్ సాధిక్ తదితరులున్నారు.


ఎంపీ ఈటలపై బేగంబజార్ పీఎస్‌లో ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న శ్రీకాంత్ యాదవ్ తదితరులు

సుల్తాన్‌బజార్: సీఎం రేవంత్‌రెడ్డిపై మేడ్చల్ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఎంపీ ఈటలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఓ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిని ఎంపీ ఈటల సైకో అంటూ వ్యాఖ్యలు చేయడం తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవిరాజ్, శ్రీనివాస్, ఖదీర్, శ్యామ్‌సింగ్, కిషన్, రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విఠల్ తదితరులు

గోల్కొండ: నాలుగు లేబర్ కోర్డ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు జి.విఠల్ డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మిక సమ్మె పోస్టర్‌ను సోమవారం ఆయన టోలిచౌకీ లేబర్ అడ్డా వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు, బడా వ్యాపారులకు మేలు జరిగేలా కార్మిక వ్యతిరేక చట్టాలు రూపొందిస్తుందని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రతినెలా రూ.4500 నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో యాకూబ్, జిలానీ, బక్షిస్ తదితరులు పాల్గొన్నారు.